సాక్షి
కుమురం భీం
గురువారం । 10 । ఆగస్టు । 2023



కబ్జాదారుల చేతుల్లోకి క్వార్టర్లు!
మందమర్రి ఏరియాలో సింగరేణి క్వార్టర్లు కబ్జాకు గురవుతున్నాయి. ఖాళీగా ఉన్న భవనాలను కార్మికేతరులు ఆక్రమించుకుంటున్నారు. 8లో▸

ఆరుకు చేరిన మద్యం దరఖాస్తులు
ఆసిఫాబాద్: మద్యం టెండర్లలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఒకే ఒక దరఖాస్తు వచ్చింది. జైనూర్ మండలంలోని ఎస్సీ రిజర్వేషన్ షాపు న.7కు ఒకరు దరఖాస్తు సమర్పించారు. దీంతో దరఖాస్తుల సంఖ్య ఆరుకు చేరాయని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.2/26.0

వాతావరణం
ఆకాశంలో కొంతమేర మేఘాలు విస్తరించి ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అధికారిపై ప్రజాప్రతినిధి ఫిర్యాదు

- నిజాయతీ ఆఫీసర్‌కు తప్పని ఒత్తిడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిజాయతీగా పని చేసిన అధికారులకు వేధింపులు తప్పడం లేదు. కుమురంభీం జిల్లా రవాణా శాఖ అధికారిపై అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. జిల్లాలో ఇసుక, కంకర తదితర రవాణా చేసే టిప్పర్లు నిబంధనలకు విరుద్ధంగా భారీ లోడ్‌తో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. దీనిపై 'సాక్షి' గత నెల 24న 'కిల్లింగ్.. ఓవర్ లోడ్' శీర్షికన ఓ కథనం ప్రచురించింది. స్పందించిన జిల్లా రవాణా శాఖ అధికారి జి.లక్ష్మీ తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అదే రోజున ఐదు టిప్పర్లు అధిక లోడ్‌తో వెళ్తున్న వాటిని గుర్తించి సీజ్ చేశారు. వాటిని విడిచిపెట్టాలంటూ ఓ ప్రజాప్రతినిధి ఫోన్ చేసి అడిగారు. అందుకు ఆమె అంగీకరించలేదు. దీంతో తాము చెప్పినా వినిపించుకోకుండా, ఫైన్ వేస్తారా? అనే కోపంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, రవాణాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. ఆ ఫిర్యాదు ప్రభుత్వ పరిశీలనలో ఉంది. దీంతో ఆమెను ఇక్కడి నుంచి బదిలీ వేటు వేస్తారా? అని అధికారుల్లో చర్చ నడుస్తోంది. అయితే తన విధులు తాను నిర్వర్తించానని, ఇందులో రాజకీయం జోక్యం చేసుకున్నా తనకేం ఇబ్బంది లేదని, ఎక్కడైనా పని చేస్తామనే ధీమాతో ఉన్నట్లు తెలిసింది.

17 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం ఈ నెల 17 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మూగ, చెవిటి వారికి డాక్టర్ స్వామి, 18న కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారికి డాక్టర్ సునీల్, 22న ఎముకల సమస్యలకు సంబంధించి డాక్టర్ కృష్ణ, 29న మానసిక వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ఆదిత్య వైద్యపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్మిక, ఉద్యోగ సంఘాల మహాధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా(మహాపడావ్) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు క్విట్ ఇండియా డే సందర్భంగా మహాపడావ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. లేబర్ కోడ్‌ల కారణంగా అసంఘటిత కార్మికులు బానిసత్వంలోకి నెట్టివేయబడుతున్నారని ఆరోపించారు. ఇండియన్ లేబర్ కాంగ్రెస్ కార్మికుల సంక్షేమం కోసం చేసిన తీర్మానాలు చిత్తుకాగితాలు మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



కుమురంభీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

అట్టహాసంగా ఆదివాసీ దినోత్సవం

- మహనీయులకు నివాళులర్పించిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మహనీయులకు నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కుమురంభీం ఆదివాసీ భవన్‌లో బుధవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన గిరిజన యోధుడు కుమురంభీంతోపాటు అమరులైన ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే కుమురంభీం చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు భారీగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, గుస్సాడీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ భవన్ వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఆదివాసీగా పుట్టినందుకు గర్వించాలి

ఆదివాసీగా పుట్టినందుకు మనమంతా గర్వించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివాసీల పోరాటాల ఫలితమే ఈ రోజు ప్రత్యేకంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. భాష, సంస్కృతిని మరిచిన రోజు ఆదివాసీలు అంతరించిపోయే పరిస్థితులు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీలో గృహలక్ష్మి పథకం నిబంధనలు సడలించి ఆదివాసీలకు పథకం వర్తించేలా చూడాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో గతంలో నిర్వహించిన వైటీసీ కేంద్రాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీల వారసత్వాన్ని పరిరక్షించేందుకే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల వస్త్రాధారణను ఎంతగానో గౌరవిస్తానన్నారు. ప్రతి ఆదివాసీ చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆదివాసీ ప్రాంతంలో విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. దేశ జనాభాలో 11 శాతం ఉన్న ఆదివాసీల కోసం ఐక్యరాజ్య సమితి మూడు దశాబ్దాల క్రితం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించిందని కొలాం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కేంద్రంలో వైటీసీ కేంద్రాన్ని పునరుద్ధరించాలని, జీవో 3 అమలు చేయాలని, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆదివాసీ సంఘాల నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఆదివాసీ సంఘాల నాయకులు పెందూర్ సుధాకర్, కుర్సెంగ గోపిరాం, నారాయణ, సంతోష్, చహకటి దస్రు, కేశవ్, గంగారాం, లక్ష్మణ్, బొమ్మెన దశరథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గుస్సాడీ వేషధారణలో కళాకారులు

ఆదివాసీల అభివృద్ధికి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి జీవన విధానంలో మార్పులు తీసుకువస్తుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వనరులను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవకాశం వస్తే హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలించాలన్నారు. రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని దిగుబడులు సాధించాలని సూచించారు. జిల్లాలో ఎనీమియా కేసులు అధికంగా ఉన్నాయని, ఫోలిక్‌యాసిడ్ మాత్రలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని కోరారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బీఆర్‌ఎస్ హయాంలో గుర్తింపు

ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ ఆదివాసీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. జోడేఘాట్ అభివృద్ధితోపాటు ఆదివాసీ సంప్రదాయాలకు గుర్తింపు లభించిందన్నారు. జంగుబాయి, నాగోబా ఆలయాలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఆదివాసీలకు పోడు పట్టాలు అందించడంతోపాటు జిల్లా కేంద్రంలో 300 పడకల జిల్లా ఆసుపత్రి, వైద్యకళాశాల ఏర్పాటు చేసి నట్టు గుర్తు చేశారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం రెండు, మూడు నెలలకు ఒకసారి రాయ్‌సెంటర్లలో సమావేశాలు నిర్వహించి, ఉట్నూర్ ఐటీడీఏ పీవోను కలవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారుల నియామకం

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారులను నియమిస్తూ ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్యాధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆదిలాబాద్ ఫుడ్‌సేఫ్టీ అధికారిగా డాక్టర్ ఎం.శ్రీధర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధికారిగా నేహ తబస్సుమ్, నిర్మల్ జిల్లా అధికారిగా డాక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా అధికారిగా వాసురామ్‌ను నియమించింది.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్: డీఈఈ సెట్– 2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు గురు, శుక్రవారాల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు డీఈఈ సెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, కుల, ఆదాయ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి



ఎల్కపల్లిలో మాట్లాడుతున్న మధుకర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): హక్కుల సాధనకు ఆదివాసీలు ఐక్యంగా ముందుకు సాగాలని గోండ్వానా ఆదివాసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసీలకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, కేంద్రం తీసుకువచ్చిన నూతన అటవీసంరక్షణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సర్పంచులు మధునయ్య, ఈశ్వరీబాయి, సంజీవ్, సుధాకర్, చంద్రమౌళి, ఎంపీటీసీ శారద, నాయకులు సిడాం అశోక్, ఆలం సకరాం, భుజంగరావు, బాపు, భాస్కర్, అక్షంతరావు, లచ్చిరాం, నందరాం తదితరులు పాల్గొన్నారు.

'మేరీ మాటి– మేరా దేశ్' విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆగస్టు 9 నుంచి 30 వరకు నిర్వహించే మేరీ మాటి– మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతిఒక్కరూ ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాంనాయక్, కొలిపాక కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి, అశోక్, ముత్తు, సునీల్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మురళి, నాయకులు సొల్లు లక్ష్మి, వెంకటేశ్, బాలకృష్ణ, సుధాకర్, సంజీవ్, తిరుపతి, జయరాజ్, సూర్యప్రకాశ్, రాంబాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ పెంపు

- క్వింటాల్‌కు రూ.140 పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- నిరీక్షణకు దక్కిన ఫలితం



జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

ఆసిఫాబాద్: రేషన్ డీలర్లకు కమీషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా కమీషన్ కోసం పోరాడుతున్న డీలర్లకు తీపికబురు అందించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావు రేషన్ డీలర్ల జేఏసీ సంఘాల ప్రతినిధులతో మంగళవారం చర్చలు జరిపి ప్రస్తుతం చెల్లిస్తున్న కమీషన్‌ను రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. చాలీచాలని కమీషన్‌తో జీవనం కొనసాగించలేకపోతున్నామని ఉద్యోగ భద్రత కల్పించాలని, క్వింటాల్‌కు రూ.250 కమీషన్ చెల్లించడంతోపాటు రూ.30 వేల గౌరవ వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో రేషన్ డీలర్లు ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. గత నెలలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇచ్చిన హామీతో సమ్మె వాయిదా వేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రస్తుతం క్వింటాల్‌కు కమీషన్ రెట్టింపు చేస్తూ రూ.140కి పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే ఆథరైజేషన్ రెన్యూవల్ 2 ఏళ్ల నుంచి 5 ఏళ్లకు పెంచారు. కరోనాతో మృతి చెందిన డీలర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద అవకాశం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

జిల్లాలో 313 మంది..

జిల్లాలో 313 రేషన్ డీలర్లు ఉండగా, 1,39,872 కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 2,961.086 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ అవుతోంది. కోవిడ్ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నాయి. డీలర్లకు నేరుగా కమీషన్ అందకపోగా మూడు నెలలకు ఒకసారి కమీషన్ అకౌంట్లలో జమ చేస్తున్నారు. దీంతో డీలర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్వహణ, విద్యుత్, హమాలీ, అద్దె ఖర్చులు భారంగా మారాయి. బస్తాల్లో తరుగు రావడంతోనూ నష్టపోతున్నామని వారు వాపోతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కొంత మేర ఊరట లభించింది.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని ఏఎంసీ గోదాం ఆవరణలో జిల్లాలోని రేషన్ డీలర్లు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం, మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు డీలర్ల కమీషన్ రెట్టింపు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. డీలర్లు ఐకమత్యంతో ఉంటే హక్కులు సాధించుకోవచ్చన్నారు. కమీషన్ కోసం కాకుండా గౌరవ వేతనం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేరు శేషగిరిరావు, జిల్లా నాయకులు ఆత్మారాం, రాపర్తి నర్సయ్య, మండల అధ్యక్షులు రాపర్తి శ్రీనివాస్, ఇస్లాం, షబ్బీర్, పాండురంగ్, చంద్రకళ, నాయకులు, డీలర్లు తణుకు మురళీ, పైడి పురుషోత్తం, గణపురం రమేశ్, పైడి శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బోద' బాధ తీరేలా..!

- నేటి నుంచి బోదకాలు నివారణ కార్యక్రమం
- మూడు రోజుల్లో 5,54,625 మందికి మాత్రల పంపిణీ
- జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



కౌటాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

కౌటాల: జిల్లాలో బోదకాలు(ఫైలేరియా) నివారణకు వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకుంటున్నా కేసులు పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టడం లేదు. అదుపులో ఉందని భావిస్తున్నా అక్కడక్కడ కేసులు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. మైక్రో ఫైలేరియా క్రిమి శరీరంలోకి వచ్చిన ఏళ్ల తర్వాత గాని లక్షణాలు బయటికి వచ్చే అవకాశం లేదు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటేనే వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో బోదకాలు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది.

జిల్లాలో 736 మంది వ్యాధిగ్రస్తులు..

బోదకాలు వ్యాధికారక పరాన్నజీవులు క్యూలెక్స్ దోమ కాటుతో ద్వారా మనుషుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇంటి పరిసరాల్లోని మురుగునీటిలో పెరిగే క్యూలెక్స్ దోమలు వ్యాధికారక జీవులను బాధితుల నుంచి ఇతరులకు వ్యాపింపజేస్తాయి. మైక్రో ఫైలేరియా శరీరంలోకి చేరిన తర్వాత లింఫ్ నాళాల్లో వృద్ధి చెందుతుంది. అవయవాల్లోకి అనవసర ద్రవాలు చేరి వాపు ఎక్కుతాయి. రాత్రిపూట శరీరంలో క్రిముల కదలికలు ఉంటాయి. లక్షణాలు ఉన్నవారు, అవయవాల వాపు ఉన్నవారు రాత్రిపూట పరీక్షలు చేసుకుంటేనే వ్యాధి గుర్తింపు సాధ్యమవుతుంది. వ్యాధి నిర్మూళనకు ఏటా జాతీయ బోద రోగ నివారణ సంస్థ(ఎన్ఎఫ్‌సీపీ) ఆధ్వర్యంలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పేరుతో ఇంటింటికీ మందుల పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 736 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇందులో 450 మందికి పైగా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. కౌటాల మండలం మొగడ్‌దగడ్, ముత్తంపేట, రెబ్బెన మండలం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లో వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారు.

నేటి నుంచి మాత్రల పంపిణీ..

ఫైలేరియా(బోదకాలు) వ్యాధి నివారణపై 2004 నుంచి జాతీయ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. 2030 నాటికి ఫైలేరియాను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో జిల్లావ్యాప్తంగా 5,54,625 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నారు. 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ సెంటర్ల సిబ్బందితో ప్రభుత్వం మూడు రోజుల పాటు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎండీఏ) చేపట్టనుంది. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, మెప్మా, ఐకేపీ వలంటీర్లతో 1,109 బృందాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి వయస్సు ఆధారంగా అల్బెండజోల్, డీఈసీ మాత్రలు అందించనున్నారు.

ఇంటింటికీ మాత్రల పంపిణీ

అన్ని గ్రామాల్లో ఇంటింటికీ నేటి నుంచి బోదకాలు వ్యాధి నిర్మూలనకు మాత్రలు పంపిణీ చేస్తారు. రెండేళ్లలోపు పిల్లలకు డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు వేయొద్దు. 3 ఫీట్ల కంటే తక్కువ ఎత్తు, ఐదేళ్లలోపు వారికి ఐవర్ మెక్టిన్ వేయొద్దు. అనుమానాలు ఉంటే వైద్యసిబ్బందిని సంప్రదించాలి. – రామకృష్ణ, డీఎంహెచ్‌వో

కుమురంభీం స్ఫూర్తితో రాజ్యాధికారం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): కుమురంభీం స్ఫూర్తితో రాష్ట్రంలో బహుజనుల రాజ్యాధికారం సాధిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి)లో ఆదివాసీ భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దిందాలో వంతెన నిర్మించాలన్న టీచర్లను ఎమ్మెల్యే కోనప్ప సస్పెండ్ చేయించారని ఆరోపించారు. చివరి శ్వాస వరకు సిర్పూర్ గడ్డను వదలనని స్పష్టం చేశారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

అవినీతి ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం చేసి, అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను తక్షణమే సస్పెండ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అవినీతికి పాల్పడిన అధికార పార్టీ సర్పంచులపై కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించాలన్నారు. లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సిర్పూర్(టి)– కాగజ్‌నగర్‌కు మధ్య రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎనిమిదేళ్లు గడుస్తున్నా పూర్తికాలేదన్నారు. కాగా.. ఉదయం కాగజ్‌నగర్‌కు చేరుకున్న ప్రవీణ్‌కుమార్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బైక్‌ర్యాలీ ద్వారా స్థానిక ఎన్టీఆర్ చౌక్‌కు చేరుకున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పార్టీ జెండా ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు యువకులు బీఎస్పీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు గణపతి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, నాయకులు గోపాల్, నాగేశ్, బాబాజీ, దుర్గం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కబ్జాదారుల చేతుల్లోకి క్వార్టర్లు!

- ఉద్యోగుల సంఖ్య తగ్గి.. పోటీ లేకపోవడంతో కార్మికేతరుల వశం
- ఆర్థికంగా నష్టపోతున్న సింగరేణి
- రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు వెనుకడుగు


మొదటి జోన్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలో సింగరేణి క్వార్టర్లు కబ్జాకు గురవుతున్నాయి. పలు గనుల మూసివేతతో ఏరియాలో కార్మికుల సంఖ్య తగ్గింది. దీంతో పలు క్వార్టర్లు ఖాళీగా ఉండడంతో కార్మికేతరులు వాటిని ఆక్రమించుకుని అందులో నివాసం ఉంటున్నారు. వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులు తక్కువ.. క్వార్టర్లు ఎక్కువ

మందమర్రి ఏరియాలో ప్రస్తుతం ఉద్యోగుల కంటే రెట్టింపు సంఖ్యలో క్వార్టర్లు ఉన్నాయి. ఏరియాలో మూడు దశాబ్దాల క్రితం సుమారు 12 వేలకు పైచిలుకు కార్మికులు ఉండేవారు. నాడు క్వార్టర్ అలాట్‌మెంట్ కావాలంటే చాలా కాంపిటీషన్ ఉండేది. ఎవరైనా ఉద్యోగ విరమణ పొంది క్వార్టర్ ఖాళీ చేస్తే సీనియర్ ఉద్యోగికి డిపార్టుమెంట్ వారీగా అలాట్ చేసేవారు. కాల క్రమేణా బొగ్గు నిల్వలు నిండుకోవడంతో ఏరియాలోని కేకే-2, ఎస్‌ఎంజీ-1, 1ఏ, 3, కేకే-5ఏ గనులు మూసివేయడంతో కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేశారు. దీంతో ఏరియాలో పదివేల పైచిలుకు క్వార్టర్లు ఉండగా ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం ఐదు వేలకు పడిపోయింది. దీంతో రాజకీయ పలుబడితో కార్మికేతరులు కబ్జాకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా కాలంచెల్లిన సింగరేణి క్వార్టర్లతో కార్మికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సుమారు ఆరున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయోననే భయంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

కంపెనీపై ఆర్థిక భారం

ఏరియాలో కబ్జాకు గురైన క్వార్టర్లతో సింగరేణి సంస్థకు ఆర్థికంగా నష్టం ఏర్పడుతోంది. ప్రస్తుతం వెయ్యి వరకు క్వార్టర్లు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. క్వార్టర్లకు విద్యుత్, తాగునీరు, ప్రాపర్టీ ట్యాక్స్ సంస్థ చెల్లిస్తుండడంతో నెలకు ఏడెనిమిది లక్షల రూపాయల వరకు ఆర్థికభారం పడుతోంది. కబ్జా క్వార్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు కూడా రాజకీయ ఒత్తిళ్లతోనే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆక్రమణలు అరికట్టడానికి డిజిటలైజేషన్

సింగరేణిలో క్వార్టర్ల ఆక్రమణలను అరికట్టడానికి యాజమాన్యం డిజిటలైజేషన్ ప్రక్రియ అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా కార్మికుడికి కేటాయించిన క్వార్టర్ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఇలా చేయడం వలన ఏరియాలో ఎన్ని క్వార్టర్లు ఉన్నాయి? ఉద్యోగికి కేటాయించిన క్వార్టర్‌లో ఇతరులెవరైనా ఉంటున్నారా? కబ్జాకు గురయ్యాయా? తదితర విషయాలు గుర్తించి పకడ్బందీగా నమోదు చేస్తారు. దీని ద్వారా సింగరేణి ఆస్తుల పరిరక్షణ సులభతరం కావడమే కాకుండా ఆర్థిక నష్టాన్ని అరికట్టవచ్చు.

ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత



సింగరేణి ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత. ఏరియాలో సింగరేణి స్థలం ఆక్రమణకు గురైనా, క్వార్టర్లలో కార్మికేతరులున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. ఏరియాలో చాలా క్వార్టర్లు శిథిలావస్థలో ఉన్నాయి. కంపెనీ క్వార్టర్లలో కార్మికేతరులు ఉంటే అనుకోని ప్రమాదం జరిగితే యాజమాన్యం ఎలాంటి బాధ్యత వహించదు.

– జీ. మోహన్‌రెడ్డి, మందమర్రి ఏరియా జీఎం

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల సస్పెన్షన్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని మొదటి జోన్ 491 క్వార్టర్‌ను తొలగించి నూతనంగా చేపట్టిన నిర్మాణంపై సింగరేణి అధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఆ క్వార్టర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు విధుల నిర్వహణ పట్ల అలసత్వం వహించిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి జోన్‌లోని 491(డీ టైపు) క్వార్టర్‌ను 2018లో మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు సర్వెంట్ మేడిపెల్లి రమేశ్ అద్దె ప్రాతిపదికన తీసుకున్నాడు. సదరు వ్యక్తి రెండేళ్ల పాటు అద్దె చెల్లించకుండా క్వార్టర్ వదిలి వెళ్లాడు. అప్పటి నుంచి ఏరియా నాయకుడు, అతని సోదరుడు ఆ క్వార్టర్‌తో పాటు పక్క క్వార్టర్‌ను కూడా కలుపుకుని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారికి ఉన్న పలుకుబడితో ఈమధ్యకాలంలో సంస్థ అనుమతి లేకుండా క్వార్టర్‌ను కూల్చివేసి నూతన నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రమేశ్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్వార్టర్‌పై ఉన్న అద్దె చెల్లింపు..

క్వార్టర్‌పై రూ.72,682 అద్దె బకాయి ఉంది. అక్రమ నిర్మాణం విషయం అధికారుల దృష్టికి వెళ్లగానే సదరు వ్యక్తిపై ఉన్న బకాయి ఈ నెల 4న రూ.20 వేలు, 7న రూ.52,682 చెల్లించారు. అయితే ఈ అద్దె ఎవరు చెల్లించారనే విషయం గోప్యంగా ఉంచారు. అంతేకాకుండా అక్రమ నిర్మాణం విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది ఏరియా అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని ఇద్దర్ని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా అక్రమ నిర్మాణాలు ఆదిలోనే నిలుపుదల చేయకుంటే మరిన్ని జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య


మహర్షి (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన ఆవుల మహర్షి (26) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ అడిషనల్ ఎస్సై రాథోడ్ తానాజీ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహర్షి కొంతకాలంగా ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఉద్యోగం లేదన్న బెంగతో పాటు పెళ్లికావటం లేదనే మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంపలపల్లిలో మరొకరు..


మహేష్ మృతదేహం

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామం ఆంధ్రాకాలనీకి చెందిన మహేష్ (20) వ్యసనాలకు అలవాటుపడి ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద బుధవారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. చంద్రపూర్‌కు చెందిన సూరజ్ టింగ్రి(26) జాతీయ రహదారిపై అమర్చిన ఐమాక్స్ విద్యుత్ లైట్స్ తనిఖీ చేస్తుండగా షాక్‌కు గురికావడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా


బోల్తా పడిన టిప్పర్

కౌటాల: మండలంలోని ముత్తంపేట సమీపంలో కౌటాల–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బుధవారం టిప్పర్ బోల్తా పడింది. ముత్తంపేట్ శివారులోని కంకర క్రషర్ల నుంచి టిప్పర్ (ఏపీ39టీఏ 5459)లో మొరం తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ చౌదరి శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అధికలోడుతో పాటు వేగంగా వెళ్లడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

జైపూర్: గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య అన్నారు. ఐకే1ఏ గనిపై బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులను చైతన్య పరిచేందుకు ఆయన ప్రత్యేక యాత్ర చేపట్టారన్నారు. తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కార్యనిర్వహణ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, నాయకులు కొమురయ్య, సిద్దయ్య, అశోక్, క్రాంతి, వెంకటేశ్, రవికిరణ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కొడుకు ఎస్సై


త్రిలోకనాథ్‌రెడ్డి

చెన్నూర్: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని చెన్నూర్ పోలీసు స్టేషన్ ఏరియాలో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాదుల తిరుపతిరెడ్డి కుమారుడు సాయి త్రిలోకనాథ్‌రెడ్డి ఇటీవల జరిగిన ఎస్సై పోటీ పరీక్షల్లో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. త్రిలోకనాథ్‌రెడ్డి చెన్నూర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 2 నుంచి 8వ తరగతి వరకు, సీసీసీ నస్పూర్‌లో 9,10 తరగతులు, గుంటూరు చైతన్య కళాశాలలో ఇంటర్, మంథని జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశాడు. 2020లో ఫైర్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్సైగా ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు త్రిలోకనాథ్‌రెడ్డిని అభినందించారు.

కోలిండియాలో లేని హక్కులు కల్పించాం


మాట్లాడుతున్న కెంగర్ల మల్లయ్య

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య

నస్పూర్: కోలిండియాలో లేని అనేక హక్కులను సింగరేణిలో సీఎం కేసీఆర్ కల్పించారని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 3 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా 15 వేల మందికి, ఇంటర్నల్ ఎక్స్‌టర్నల్ ద్వారా మరో 5 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్ దేనన్నారు. కార్మికులకు ఇంటి నిర్మాణానికి వడ్డీ లేకుండా రూ.10 లక్షల రుణం, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం కల్పించామన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాలకు పెంచేందుకు కృషి చేశామన్నారు. అంతేకాకుండా కార్మికులకు రూ.700 కోట్ల లాభాల వాటా పంచబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ అన్నయ్య, మంద మల్లారెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, బ్రాంచి సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, గడండ మహిపాల్‌రెడ్డి, గని పిట్ సెక్రటరీ రిక్కల గోపాల్ పాల్గొన్నారు.

జీఎం ఆఫీస్‌లో బయోమెట్రిక్ మిషన్ ప్రారంభం


బయోమెట్రిక్ మిషన్ ప్రారంభిస్తున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియా జీఎం మోహన్‌రెడ్డి బయోమెట్రిక్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఇకనుంచి అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు, ఐటీడీవై రవి, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయ్‌బస్తీ కాలనీ శివారులో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితుల వద్ద నుంచి రూ.2,940 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బావపై బావమరిది దాడి

మంచిర్యాలక్రైం: చున్నంబట్టి వాడలోని తిరుమలగిరి కాలనీకి చెందిన శరత్, అతని బావ సతీష్ ఇద్దరూ కలిసి బుధవారం బాలాజీ వైన్స్‌లో మద్యం సేవించారు. అక్కడే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన అనంతరం మళ్లీ గొడవ జరగడంతో ఆవేశంలో శరత్ తనవద్ద ఉన్న నెయిల్ కట్టర్‌తో పొట్టపై దాడి చేయగా సతీష్‌కు స్వల్పగాయమైంది. శరత్ తమ్ముడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కందకంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


శ్రీరాంపూర్ వద్ద అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

నస్పూర్: మంచిర్యాల ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుండి మంచిర్యాలకు వస్తున్న బస్సు బుధవారం తెల్లవారుజామున శ్రీరాంపూర్ ఏరియా అరుణక్క నగర్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కందకంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సు స్వల్పంగా ధ్వంసమైంది. ఘటన సమయంలో బస్సులో నలుగురు ప్రయాణికులు ఉండగా వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి


ధర్నా చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు విడనాడాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలను అనుసరించి హక్కులు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలకు స్వస్తి పలికి రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను నీరుగార్చి హక్కులు లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. పెట్రోల్, డీజిల్‌పై పెంచిన అన్నిరకాల పన్నులను రద్దు చేయాలన్నారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం డీఏవో మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఇఫ్టూ, టీఎస్టీయూసీ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేశ్, ఎల్తూరి శంకర్, ఎండీ చాంద్‌పాషా, టి.మణిరాంసింగ్, అక్కెపల్లి బాపు, జేసీ మాణిక్యం, ఆడెపు రాజమౌళి, మల్లయ్య, ఐలయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' విజయవంతం చేయాలి


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: బోధకాలను తరిమికొట్టేందుకు ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థినులకు బోదకాలు నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్, సీహెచ్‌వో రాంమూర్తి, రాజీవ్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ శ్వేత, పాతమంచిర్యాల వైద్యాధికారి డాక్టర్ నాగమణి విద్యార్థులకు బోదకాల నివారణపై అవగాహన కల్పించారు. 10 నుంచి 12 వరకు బూత్‌స్థాయిలో మాత్రల పంపిణీ, 13 నుంచి 22 వరకు ఇంటింటికీ వెళ్లి మందులను అందించడం మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా చేపట్టనున్నట్లు వివరించారు.

స్వాతంత్య్ర వేడుకల నిర్వహణపై సమీక్ష

నస్పూర్: ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జీఎం సంజీవరెడ్డి బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేడుకల విజయవంతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, పర్సనల్ డీజీఎం అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్‌లో ఉద్యోగాలపై అభ్యంతరాల స్వీకరణ

మంచిర్యాలటౌన్: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చైల్డ్‌లైన్‌లో వివిధ రకాల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచామని, అభ్యంతరాలుంటే ఈ నెల 11లోగా తెలియజేయాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య తెలిపారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక పోస్టుకు 54, కౌన్సిలర్ ఒక పోస్టుకు 33, చైల్డ్‌హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ 3 పోస్టులకు 105, కేస్ వర్కర్ మూడు పోస్టులకు 124 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అభ్యంతరాలను 11వ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- మద్యం మత్తులో భార్యను కొట్టిచంపిన భర్త


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

మందమర్రిరూరల్: కట్టుకున్న భర్తే భార్యను హత్యచేసిన ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్, మృతురాలి కుమారుడు అమర్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గుంటి మాధవి (38) పదిహేనేళ్ల క్రితం తన మొదటి భర్త గంగారాంకు విడాకులిచ్చి గుంటి దేవేందర్‌ను రెండో వివాహం చేసుకుంది. కూలిపని చేసుకుంటూ ఇద్దరూ కలిసి స్థానిక ఒర్రెగడ్డ ఏరియాలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన దేవేందర్ తరచూ డబ్బుల కోసం మాధవిని కొడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా అతిగా మద్యం సేవించిన దేవేందర్ తీవ్రంగా కొట్టడంతో మృతి చెందింది. ఈ విషయాన్ని దేవేందర్ మేనల్లుడు అజయ్ ద్వారా మొదటి భర్త కుమారుడు అమర్‌నాథ్‌కు సమాచారం అందించాడు. అమర్‌నాథ్ ఫిర్యాదుతో సీఐ మహేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అమర్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- అచ్చులాపూర్‌లో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

తాండూర్(బెల్లంపల్లి): వివాహేతర సంబంధం ఒకరి ఉసురు తీసింది. కట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలం అచ్చులాపూర్‌కు చెందిన సిద్దం శ్రీనివాస్ (40), బానక్క దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం క్రితం ఐబీ తాండూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామం వచ్చారు. ఐబీ తాండూర్‌కు వెళ్లిన సమయంలో తాండూర్‌కు చెందిన మేడి శంకర్‌తో బానక్కకు వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం శ్రీనివాస్‌కు తెలియడంతో మద్యానికి బానిసయ్యాడు. పద్ధతి మార్చుకోవాలని కుటుంబ సభ్యులు కోరినా ఆమెలో మార్పురాలేదు. దీనిపై దంపతుల మధ్య తరచూ గొడవ జరుగుతుండేది. మంగళవారం కూలిపనులకు వెళ్లిన శ్రీనివాస్ ఇంటికి రాలేదు. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో అచ్చులాపూర్‌కు చెందిన కట్ల శివకుమార్ మృతుని కుమారుడు సాయికి ఫోన్‌చేసి గోపాల్‌నగర్ క్రాస్‌రోడ్ పక్కన మద్యం సేవించి పడిఉన్నట్లు తెలిపాడు. బుధవారం ఉదయం గోపాల్‌నగర్ శివారు ప్రాంతం మల్లన్న గుట్ట వద్ద శ్రీనివాస్ మృతి చెంది కనిపించాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడు శంకర్, బానక్క కలిసి హత్య చేసినట్లు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా బురద గుంటలో మృతదేహాన్ని పడేసినట్లు తెలిపారు. మృతునికి తల్లి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనాస్థలిని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, తాండూర్, కన్నెపల్లి, మాదారం ఎస్సైలు రాజశేఖర్, నరేష్, రాజశేఖర్ పరిశీలించారు. మృతుని తల్లి సిద్దం మొండక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

జైపూర్: మండలంలోని శివ్వారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు గున్నాల రాజేశ్వరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 7న అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో డీఈవో ఎస్.యాదయ్య సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు రోజుల క్రితం జైపూర్ ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేసిన సమయంలో ఎక్కువ మంది విద్యార్థులు గైర్హాజరు అవుతున్నారని తేలింది. పాఠశాల క్లాస్ టీచర్లు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం పాఠశాలకు రెగ్యులర్‌గా రాని విద్యార్థులను రప్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై డీఈవో వివరణ కోరారు. సరైన వివరణ ఇవ్వకపోవడంతో హైస్కూల్ హెచ్‌ఎం అలీస్‌మాధుర్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

హైస్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

చెన్నూర్: చెన్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంతో హెచ్‌ఎం కరుణాకర్‌కు డీఈవో యాదయ్య షోకాజ్ నోటీసు జారీచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'తొలిమెట్టు'లో భాగంగా పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 5న చెన్నూర్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు డీఈవో హాజరయ్యారు. 100 మందికి 70 మంది విద్యార్థులు మాత్రమే హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.